క్లుప్తంగా

మీడియేషన్ ఫర్ ది నేషన్ అవగాహన ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి హరినారాయణ తదితరులు

రామచంద్రపురం: న్యాయపరమైన చిక్కులను సరళీకృతం చేసే ఉద్దేశంతో మీడియేషన్ ఫర్ ది నేషన్ అవగాహన కార్యక్రమాన్ని 13వ జిల్లా అడిషనల్, సెషన్స్ కోర్టు జడ్జి ఎం.హరినారాయణ గురువారం ప్రారంభించారు. రామచంద్రపురం అడిషనల్ జిల్లా కోర్టులో జరిగే ఈ కార్యక్రమం ఈ నెల 16 వరకు కొనసాగుతుంది. అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నాగేశ్వరరావు నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరినారాయణ మాట్లాడుతూ, మీడియేషన్ ట్రైనింగ్ వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. దీనివల్ల కేసులు త్వరితంగా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో ఎలా రాజీ చేసుకోవచ్చో, అలాగే మీడియేషన్ మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని వివరించారు. అడ్వకేట్లకు ఏ విధమైన ఇబ్బందులు ఉండవన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాల్‌రావు, మీడియేషన్ ట్రైనింగ్ అడ్వకేట్లు కె.సత్యవాణి, దొమ్మలపాటి సత్యనారాయణ, సన్నపు కుమారస్వామి, బండి శ్రీనివాస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తీరిన మంచినీటి సమస్య



బొందులగూడెంలో కుళాయి ప్రారంభిస్తున్న సర్పంచ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, అన్నాయిపేట గ్రామాల్లో కలసి ఉండే బొందులగూడెం వాసులకు మంచినీటి సమస్య తీరింది. రెండు గ్రామాల సరిహద్దులో ఉండటం వల్ల ఏళ్ల తరబడి మంచినీటి కుళాయిలకు వీరు నోచుకోలేదు. ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ చొరవతో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను గురువారం ప్రారంభించారు. స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యా కమిటీ చైర్మన్‌గా శివశంకర్



శివశంకర్‌ను అభినందిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

కాజులూరు: గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన విద్యా కమిటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన ముర్రే శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో విద్యా కమిటీ చైర్మన్‌గా పనిచేసిన కొల్లిశెట్టి సత్యం (పలావ్ స్వామి) ఇటీవల గొర్రిపూడి తుల్యభాగ డ్రెయిన్‌లో పడి మృతిచెందారు. దీంతో కమిటీ నూతన అధ్యక్షుని ఎన్నిక అనివార్యమైంది. స్కూల్ హెచ్ఎం పి.సుశీలమణి ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. మొత్తం 15 మంది సభ్యులు ఏకగ్రీవంగా శివశంకర్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

డీఎం భాస్కరరావుకు అవార్డు



డీపీటీఓ నుంచి అవార్డు అందుకుంటున్న డీఎం భాస్కరరావు

రామచంద్రపురం రూరల్: ఆర్టీసీ రామచంద్రపురం డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో టైరు విభాగంలో జీరో స్క్రాప్ రేటు సాధించినందుకు అవార్డు లభించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు నుంచి వచ్చిన ప్రశంసాపత్రాన్ని డీపీటీఓ రాఘవకుమార్ చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. ఆర్టీసీ డిపో సిబ్బంది, కార్మికులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మండపేటలో లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గంలోని 17 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.25,59,909 విలువైన చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన లబ్ధిదారులకు సాయం మంజూరైందన్నారు.

గొంతు తడారి.. ఊరు ఎడారి

- తణుకువాడలో తాగునీటికి కటకట
- సరఫరా నిలిపివేసిన శలపాక పంచాయతీ
- గత ప్రభుత్వ హయాంలో నూతన వాటర్ ట్యాంకు, పైపులైన్ల నిర్మాణం
- అనుసంధానం కాని ప్రధాన పైపులైన్
- ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో తప్పని తిప్పలు



తణుకువాడలో తాగునీటి కోసం కుళాయి వద్ద ఉంచిన బిందెలు, బకెట్లు

కాజులూరు: ఆ ఊరికి మంచినీరే కరవైంది. జనం దాహార్తితో పెడుతున్న కేకలు పాలకులకు వినిపించడం లేదు. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్నట్టుగా తయారైంది తణుకువాడ గ్రామస్తుల పరిస్థితి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించినా.. ప్రస్తుత పాలకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరితో గ్రామస్తులకు తాగునీరు అందడం లేదు.

మండలంలోని తణుకువాడలో కొంతకాలంగా ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా గ్రామంలో రక్షిత మంచినీటి పథకం లేకపోవటంతో, కొన్నేళ్లుగా సమీప గ్రామమైన శలపాక రక్షిత మంచినీటి పథకం నుంచి ఈ గ్రామానికి తాగునీటి సరఫరా చేసేవారు. నీటి అవసరాలు పెరగడంతో శలపాక మంచినీటి పథకం నుంచి తాగునీటి సరఫరా ఆ గ్రామ ప్రజలకే గగనమైంది. ఈ క్రమంలో తణుకువాడకు నీటి సరఫరా అంతంతమాత్రంగా మారింది. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో మంచినీటి ట్యాంకు, నిర్మించి పైపులైన్ల ద్వారా గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకం నుంచి తణుకువాడకు తాగునీరు సరఫరా చేసేలా ఏర్పాట్లు జరిగాయి. ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకు నిర్మాణం, గొల్లపాలెం వరకు పైపులైన్ నిర్మాణం పూర్తి చేశారు. పైపులైన్‌ను పాల్యాని చెరువు సెంటరు వద్ద మెయిన్ లైన్‌లోకి కలిపి, గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకానికి అనుసంధానం చేయాల్సి ఉంది. ఈ విషయంలో కొన్ని కారణాల వల్ల అధికారులు, నాయకులు తాత్సారం చేస్తుండటంతో, తణుకువాడ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, నాయకులు స్పందించి కొత్తగా ఏర్పాటు చేసిన పైపులైన్‌ను గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకానికి అనుసంధానం చేసి, గ్రామంలో నిర్మించిన మంచినీటి ట్యాంకును ప్రారంభించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చుక్క నీరు రావటం లేదు



గ్రామంలో దాదాపు ప్రతి వీధిలో కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. అయినా చుక్క నీరు రావటం లేదు. గతంలో శలపాక రక్షిత మంచినీటి పథకం నుంచి మా గ్రామానికి తాగునీరు సరఫరా జరిగేది. ఇప్పుడు రావటం లేదు. కారణం అడుగుతుంటే.. ఫిల్టర్ బెడ్లు పాడయ్యాయని పాలకవర్గం చెబుతుండగా, ఇక్కడ సరఫరా అయ్యే తాగునీరు స్థానిక అవసరాలకే సరిపోతుందని, అందుకే పొరుగు గ్రామాలకు ఇవ్వలేకపోతున్నామని సిబ్బంది చెబుతున్నారు.

– పితాని సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

ఇబ్బందులు తప్పడం లేదు



మా గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. వేసవిలో కుళాయిల నుంచి నీరు రాకపోవటంతో గొల్లపాలెం నుంచి టిన్నులతో తాగునీరు కొనుక్కుని తెచ్చుకునేవాళ్లం. వేసవి ముగిసినప్పటికీ ప్రస్తుతం అదే పరిస్థితి కొనసాగుతోంది. మంచినీటి ట్యాంకు, పైపులైన్ నిర్మాణం పూర్తయింది. గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకంలోకి అనుసంధానం చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలి.

– పి.సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్

నందిగం సురేష్‌ను కలిసిన మండపేట నాయకులు



నందిగం సురేష్‌తో మండపల్లి రవికుమార్

కపిలేశ్వరపురం: మండపేటకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను కలిశారు. మండపేట 8వ వార్డు కౌన్సిలర్ నియోజకవర్గ ఆర్‌టీఐ కన్వీనర్ మండపల్లి రవికుమార్, 18వ వార్డు పార్టీ ఇన్‌చార్జి ఎర్రగుంట అయ్యప్ప, పట్టణానికి చెందిన నాయకుడు దుగ్గిరాల చిన్నలు అమరావతి సమీపంలోని ఉద్దండరాయుడుపాలెంలో నందిగం సురేష్‌ను కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమిస్తున్న సురేష్‌ను ఏడాదిపాటు జైలులో పెట్టించడం కూటమి ప్రభుత్వ కుట్ర దాగి ఉందన్నారు. ప్రశ్నిస్తున్న నాయకులను మరీ ముఖ్యంగా దళిత నాయకులను కేసులతో హింసించే చర్యలుఇ కూటమి అప్రజాస్వామిక పాలనకు నిదర్శనమన్నారు.

విద్యా సంస్థల్లో రాజకీయ ప్రేరణ ఉండరాదు

మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ ప్రేరణ కాదని, విద్యా ప్రేరణ మాత్రమే ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణంలోని 21వ వార్డు రత్నంపేట మున్సిపల్ పాఠశాలలో గురువారం జరిగిన మెగా పీటీఎంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీలు పూర్తి చేసి, డీఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసే చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలోనే పాఠశాలలకు ప్రాథమిక సదుపాయాలు పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. విద్యా వ్యవస్థను సమూలంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు.

కొత్త విద్యా విధానంలో అన్ని భాషల పాఠ్యాంశాలను ఒకే పుస్తకంలో పొందుపరిచి, వివిధ సబ్జెక్టులను సెమిస్టర్ పద్ధతిలో రూపొందించారన్నారు. విద్యా హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తున్నామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ద్వారా పిల్లలకు పోషక విలువలతో కూడిన భోజనం అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కేవీఆర్ రాజు, ఎంపీడీవో పద్మజ్యోతి, హెచ్ఎం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ ఎ.నాగరాజు, ఎంఈఓ–2 సీహెచ్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని 12 హైస్కూళ్లు, 11 మోడల్ ప్రైమరీ, 52 ప్రాథమిక, 2 ప్రభుత్వ జూనియర్ కాలేజీలతో పాటు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో మెగా పీటీఎం నిర్వహించారు. కె.గంగవరంలో ఎంఈఓలు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు, పౌష్టికాహారం అందుతుందని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సలహాలు స్వీకరించారు. పామర్రు జూనియర్ కాలేజీ వద్ద తల్లిదండ్రులకు మొక్కలను అందించారు.



రత్నంపేట స్కూల్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న మంత్రి సుభాష్

మొక్కల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వివిధ పాఠశాలల్లో మెగా పీటీఎం సందడి నెలకొంది. హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామ, వెంకటాయపాలెం జెడ్పీ హైస్కూళ్లలో పీటీఎంలు జరిగాయి. వెల్ల స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు.

తల్లిదండ్రుల బాటలో సామాజిక ఉన్నతి



రాయవరం ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థుల విన్యాసాలు

కపిలేశ్వరపురం: తల్లిదండ్రుల బాటలో ప్రతి విద్యార్థి సామాజిక ఉన్నతిని సాధించగలుగుతారని మండపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం 2.0 సమావేశాల్లో పాల్గొన్న వక్తలన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో మండపేట పట్టణం, మండపేట రూరల్ మండలం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో నిర్వహించారు. విద్యాశాఖ నియమించిన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో విద్యాలయాల్లో నిర్వహించిన సమావేశాల్లో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో విద్యార్థి జీవితాన్ని ఉన్నతీకరించాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలకు మండల ప్రత్యేకాధికారి మండల పరిశీలకురాలు, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎస్ఎస్ఏ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. మండపేట పట్టణంలోని డా.పాలడుగు చంద్రమౌళి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అతిథిలుగా హాజరయ్యారు. హెచ్ఎం రాజు, పాఠశాల భవన నిర్మాణ దాత డాక్టర్ పాలడుగుల చంద్రమౌళి, తహసీల్దార్ తేజేశ్వరరావు పాల్గొన్నారు. ద్వారపూడి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెస్ క్రీడాకారిణి, కోచ్ గోలి సంధ్య హాజరయ్యారు. వెలగతోడు, తాపేశ్వరం, ద్వారపూడి ఉన్నత పాఠశాలల్లో తల్లులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.



ద్వారపూడిలో పోటీలో గెలుపొందిన తల్లికి బహుమతిని అందజేస్తున్న చెస్ క్రీడాకారిణి గోలి సంధ్య

పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు

రాయవరం: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు గురువారం మండలంలో నిర్వహించారు. మండలంలోని 12 గ్రామాల పరిధిలోని 34 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటుగా ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పీటీఎం సమావేశాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాలకు ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు, దాతలు హాజరయ్యారు. పాఠశాలలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తల్లులకు రంగవల్లుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ఎం.ఈ వో–2 వై.సూర్యనారాయణలు వివిధ పాఠశాలలను సందర్శించి, సమావేశాలను పర్యవేక్షించారు.

వెండి కవచం సమర్పణ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారికి రామచంద్రపురం మండలం హసన్‌బాదకు చెందిన మాజీ సర్పంచ్ పచ్చిపాల వీరవెంకట్రావు (బుజ్జి), వెంకటలక్ష్మి దంపతులు రూ.3.7 లక్షల విలువైన వెండితో తయారు చేయించిన కవచం సమర్పించారు. వాటిని స్వామివారికి ఆలయ అర్చకులు అలంకరించారు. దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.



వీరభద్రస్వామికి వెండి కవచం అందజేస్తున్న పచ్చిపాల బుజ్జి, వెంకటలక్ష్మి దంపతులు

పీఠంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



అంగరలో అమ్మవార్లకు సారె తీసుకెళ్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో వెదురుపాక విజయదుర్గా అమ్మవారు



గొల్లపాలెంలో ప్రత్యేకాలంకరణలో సాయిబాబా



నేలటూరు బాబా మందిరంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

రావరం: మనలో ఉన్న జ్ఞానాన్ని ప్రకాశింపజేసేవాడే అసలైన గురువని, గురు పరంపర వ్యాస మహాముని కాలం నుంచి వస్తుందని కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా సాగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పురందేశ్వరి పాల్గొని మాట్లాడారు. పీఠం భక్తులతో కిటకిటలాడింది. పీఠంలోని విజయదుర్గా అమ్మవారిని నయనానందకరంగా అలంకరించి వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదిశంకరాచార్యులు, శృంగేరి పీఠాధిపతి అభినవ విద్యాభారతి, భారతీ తీర్థస్వామివార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. గురుపౌర్ణమి పూజల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్ తదితరులు గాడ్ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పురందేశ్వరిని పీఠం అడ్మినిస్ట్రేటర్ వి.వి.బాపిరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మండలంలో అన్ని గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. షిర్డిసాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

అంగరలో శాకంబరి ఉత్సవాలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలో ఉన్న నూకాంబిక, ఆదిలక్ష్మి అమ్మవార్ల శాకంబరి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆషాఢ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకుడు సంపర లక్ష్మీనరసింహ భాస్కర శ్రీనివాసచార్యులు, ఆలయ ఆసాదుల ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీదేవి పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అందంగా అలంకరించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ యడ్లపల్లి రాజా సీతారాం, శ్రావణి సంతోషి దంపతులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. గ్రామంలో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లిన భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. గ్రామంలో శాకాంబరి ఉత్సవాలను తొలిసారిగా నిర్వహిస్తున్నామని, ఇకపై ఏటా నిర్వహించేందుకు నిర్ణయించినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ సీతారాం తెలిపారు. కార్యక్రమంలో పిల్లా బసవరాజు, దానేటి శరత్, మేడిద సుబ్రహ్మణ్యం, దాసరి ఆంజనేయులు, గరగ శ్యాంబాబు, గంధ్రోతుల నాగ మహేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గురుపౌర్ణమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు సాయిబాబా మందిరాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గొల్లపాలెం, ఆర్యావటం, జగన్నాథగిరి, పెనుమళ్ల, అయితపూడి, చేదువాడ, కాజులూరు, శీల, ఉప్పుమిల్లి గ్రామాల్లోని సాయిబాబా మందిరాలు కిటకిటలాడాయి.

ఈ సందర్భంగా బాబావారికి పంచామృతాభిషేకం, విష్ణు సహస్ర సామూహిక పారాయణం, అష్టోత్తర విభూది పూజలు, ప్రత్యేక హారతులు, పూజలు నిర్వహించారు. సాయి నామకీర్తనలతో గ్రామ ప్రదక్షిణలు నిర్వహించారు. పలుచోట్ల ప్రసాద వితరణలు, అన్న సమారాధనలు జరిగాయి.



మండపేట డిగ్రీ కళాశాలలో గురువును సన్మానిస్తున్న విద్యార్థులు

గురువు చూపిన బాటతో మంచి భవిష్యత్తు

కపిలేశ్వరపురం: గురువు చూపిన బాటతో మంచి భవిష్యత్ లభిస్తుందని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. మండల పరిధి నేలటూరులోని శ్రీస్వర్ణ నాగ సాయిబాబా ఆలయంలో గురువారం నిర్వహించిన గురుపూర్ణిమ పూజా కార్యక్రమంలో చైర్‌పర్సన్ పాల్గొన్నారు. బాబా హారతిని తిలకించారు. గ్రామ ఆలయ కమిటీ సభ్యులు శనక్కాయల దొరబాబు, వాసా సత్తిబాబు, బి.సూర్యనారాయణ, సిద్దాని రవి కుమార్, దొడ్డిపట్ల వెంకటరమణ, చల్లా వీరభద్రుడు, వాసా శివరాం, పాల్గొన్నారు. అంగర, నల్లూరు, కాలేరు, వెదురుమూడి గ్రామాల్లోని బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మండపేట మండలంలో..

మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.టీకేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ గురువంటే సమాజపు గీటురాయి అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆనంద్, డా. నెహ్రూ నాయక్, డా. కేఎస్ఆర్ కిరణ్, వెంకన్న, డా.మధు పాల్గొన్నారు. కేశవరం గ్రామం మెరక వీధిలోని సాయిబాబా మందిరంలో పూజలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయురాలు వల్లభనేని విజయ మంగళాదేవి, వల్లభనేని రవీంద్రబాబు, గొడవర్తి రామచంద్రరావు, మద్దుల సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు కపిలేశ్వరపురంలో బీఎల్‌ఓలకు శిక్షణ

కపిలేశ్వరపురం (మండపేట): జాతీయ, రాష్ట్రీయ ఎన్నికల కమిషనర్ల ఆదేశాలపై శుక్రవారం కపిలేశ్వరపురం మండలంలోని 45 మంది బీఎల్‌ఓలకు పలు అంశాలై శిక్షణ ఇవ్వనున్నట్టు మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి గురువారం తెలిపారు. ఇటీవల మాస్టర్ ట్రైనర్ నాగం నాగ శివ, ఏడిద సచివాలయం 1 వెల్ఫేర్ అసిస్టెంట్లు న్యూ ఢిల్లీలో శిక్షణ పొందారని శిక్షణ అంశాలపై బూత్ లెవెల్ అధికారులకు అవగాహన తరగతులను నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒక రోజు శిక్షణ తరగతిని నిర్వహించనున్నామని కృష్ణమూర్తి తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. అంగర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో అంగర, వల్లూరు, టేకి, శ్రీరామపురం, మాచర మట్లలు గ్రామాల్లో సరఫరాను నిలిపివేయనున్నామని తెలిపారు.

రామచంద్రపురం రూరల్: ట్రీ కటింగ్, లైన్ల మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్రాక్షారామ 33/11 కేవీ, తాళ్లపాలెం 11 కేవీ ఫీడర్, వెంకటాయపాలెం 11 కేవీ ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. ద్రాక్షారామ, తాళ్లపాలెం, ఉట్రుమిల్లి, నెలపర్తిపాడు, వెలంపాలెం, వెంకటాయపాలెం, వేగాయమ్మపేట, బాపనయ్యచెరువు, జగన్నాయకులపాలెం, ఆదివారపుపేట, తోటపేట, అన్నాయిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. విద్యుత్‌లైన్ల వెంబడి చెట్టు కొమ్మలను తొలగించడం, లైన్ నిర్వహణ సమస్యల పరిష్కారం కోసం కేశవరం, వేములపల్లి, తాపేశ్వరం, ఇప్పనపాడు, గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

రేపు నల్లూరులో...

కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామంలో శనివారం ఆర్ఎస్ఎస్‌డీ పనులు నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రత్నాలరావు తెలిపారు.